క్లుప్తంగా

పోలేరమ్మకు పొంగళ్లు

జలదంకి: మండలంలోని కమ్మవారిపాళెం, చామదల, జలదంకి, బ్రాహ్మణక్రాక గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల వద్ద ఆదివారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఆత్మకూరు: జంగాలపల్లి వద్ద నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సెబ్ సీఐ బీ నయనతార ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం పట్టుకున్నారు. మున్సిపల్ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి



ఉదయగిరి: తిరుమలాపురం రెవెన్యూ పరిధిలో ఖాళీ ప్రభుత్వ భూములను ఇతర గ్రామాల వ్యక్తులకు పంచొద్దని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ సానా శ్రీనివాసులరెడ్డికి ఆదివారం వినతిపత్రం అందజేశారు. త్వరలో చేపట్టనున్న భూపంపిణీలో తమ రెవెన్యూ పరిధిలో అర్హులైన పేదలకు మాత్రమే భూములు పంపిణీ చేయాలని కోరారు. వరికుంటపాడు మండలం చెన్నంపల్లికి చెందిన పలువురు భూములను ఆక్రమించి విక్రయిస్తున్నారని ఆరోపించారు. గ్రామసభ నిర్వహించి ఖాళీ భూముల సర్వేనంబర్లు తెలియజేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కావలి రూరల్: వార్డు కన్వీనర్లు, వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని 37వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి దామిశెట్టి సుధీర్‌నాయుడు కోరారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 37వ వార్డులో వలంటీర్లు, వార్డు కన్వీనర్లతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. వార్డు పరిధిలోని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. ఆవుల సురేష్‌రెడ్డి, నందనవరం సీతారావమ్మ, చందు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు నిర్మాణ పనులు ప్రారంభం



కొండాపురం : మర్రిగుంటలో పోలీసు బందోబస్తు నడుమ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను అధికారులు ఆది వారం ప్రారంభించారు. గతంలో సంపద తయారీ కేంద్రం నిర్మాణానికి అధికారులు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించగా, గ్రామానికి చెందిన చినఅంకయ్య తన భూమి అంటూ అడ్డుకున్నాడు. దీంతో సర్పంచ్ దార్ల గోపి హైకోర్టును ఆశ్రయించగా పంచాయతీకి అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ మేరకు మండలాధికారులు శనివారం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు రాగా, చినఅంకయ్య కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడంతో వెనుదిరిగారు. ఈ నేపథ్యంలో ఎస్సై ఖాజావలి ఐదుగురు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయగా, సర్పంచ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఎన్‌ఆర్‌జీఎస్ ఈసీ జహీర్ నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఆదర్శ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



మర్రిపాడు: నందవరం ఆదర్శ పాఠశాల విద్యార్థినులు జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపల్ శారదాకుమారి తెలిపారు. నెల్లూరులో శని, ఆదివారాల్లో జరిగిన సైన్స్‌ఫెయిర్‌లో పదోతరగతి విద్యార్థినులు అనన్యచరిత, కుసుమ, హిబ్జా, శ్రీలక్ష్మి మేథమెటికల్ మోడలింగ్ విభాగంలో పైథాగరస్ సిద్ధాంతాన్ని ఉపయోగించి సముద్ర జలాల్లో తిమింగలాలను కాపాడే గణిత నమూనాను ప్రదర్శించినట్లు చెప్పారు. ఈ నమూనాను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో పాటు గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసకుమార్‌ను అభినందించారు.

ఉచితంగా ఎలుకల మందు పంపిణీ

సంగం: వరి పంటలో ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును మండలంలోని 13 రైతుభరోసా కేంద్రాల ద్వారా సోమవారం నుంచి రైతులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఏఓ శ్రీహరి ఆదివారం తెలిపారు. రైతులు బియ్యం లేదా నూకలు తీసుకొని వస్తే ఏ విధంగా మందు కలపాలో చూపిస్తామని చెప్పారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాడు నరకం.. నేడు సుగమం



నూతనంగా పునర్నిర్మించిన ఆత్మకూరు-సోమశిల రోడ్డు



నూతనంగా నిర్మించిన ఆత్మకూరు-నాగులపాడు రోడ్డు



సుందరంగా తీర్చిదిద్దిన నెల్లూరుపాళెం-ఆత్మకూరు రోడ్డు

ఆత్మకూరురూరల్: మండలంలోని గ్రామీణ ప్రాంతాలను కలిపే ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గుంతలతో నిండి నరకానికి నకళ్లుగా మారాయి. దీంతో గత ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రాంత ప్రజలు రాకపోకలు సాగించేందుకు నరకాన్ని చవిచూశారు. ఈ నేపథ్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రహదారుల పునర్నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో సుమారు వంద గ్రామాల ప్రజలు హాయిగా రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఆత్మకూరు-సోమశిల రోడ్డు తొమ్మిది కిలోమీటర్ల మేర ఛిద్రమై గుంతలతో నిండడంతో ఆ మార్గంలో ప్రయాణించే అనంతసాగరం, ఆత్మకూరు మండలాల్లోని 40 గ్రామాల ప్రజలు పడరాన్ని పాట్లు పడ్డారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.3.40 కోట్ల వ్యయంతో రెండు వరుసలుగా రహదారిని తీర్చిదిద్దడంతో ఆ మార్గంలో వెళ్లే ప్రయాణికులు ప్రయాణ సుఖాన్ని ఆస్వాదిస్తున్నారు. అలాగే ఆత్మకూరు నుంచి బట్టేపాడు, అప్పారావుపాళెం మీదుగా వీర్లగుడిపాడు వరకు 12 కిలోమీటర్ల మేర రోడ్డు దారుణంగా తయారవడంతో చేజర్ల మండలం నుంచి ఆత్మకూరుకు రాకపోకలు సాగించే వారు అవస్థ పడేవారు. ఈ రోడ్డును రూ.3 కోట్ల వ్యయంతో ఇటీవల ప్రభుత్వం పునర్నిర్మించడంతో ప్రయాణ కష్టాలు తప్పాయి. ఇదే ప్యాకేజీలో ఆత్మకూరు-నాగులపాడు రోడ్డును మరో పది గ్రామాల ప్రజల రవాణా సౌకర్యాలకు అనువుగా పునర్నిర్మించడంతో ప్రస్తుతం తాము సుఖంగా రాకపోకలు సాగించగలుగుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అలాగే ఆత్మకూరు-నెల్లూరుపాళెం మధ్యన ఒకటిన్నర కిలోమీటర్ల మేర నాలుగు వరసల రోడ్డును రూ.1.50 కోట్లతో రోడ్లు భవనాల శాఖ సర్వాంగ సుందరంగా నిర్మించింది. గ్రామీణ ప్రాంతాలను కలిపే రోడ్లను అభివృద్ధి చేయడంతో మండలంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు అనంతసాగరం, చేజర్ల మండలాల్లోని సుమారు 30 గ్రామాల ప్రజలు సుఖ ప్రయాణాన్ని ఆస్వాదిస్తున్నారు. సుమారు ఏడేళ్ల పాటు తాము పడ్డ ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం రోడ్లను పునర్నిర్మించడంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కరవళ్ల ట్రస్టు సేవలు అభినందనీయం



పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎస్సై ఎం శివశంకర్‌రావు

ఆత్మకూరు: గత 19 ఏళ్లుగా కరవళ్ల వరదారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. కరవళ్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 200 మందికిపైగా పేద వృద్ధులకు దుప్పట్లతో పాటు రూ.1200 చొప్పున పింఛన్లు అందజేశారు. అలాగే బట్టేపాడు, నల్లపరెడ్డిపల్లి పాఠశాలల్లో విద్యలో ప్రతిభకనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు. పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎస్సై ఎం శివశంకర్‌రావు, విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కరవళ్ల రవీంద్రారెడ్డి ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోయిన దాతల సహకారంతో ఏటా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు చేపడుతుండడంతో స్ఫూర్తి దాయకమన్నారు. జేవీవీ కన్వీనర్ హరికృష్ణ, ఆంజనేయులు, విశ్రాంత ఉపాధ్యాయుడు చెంచురత్నం, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మర్రిపాడు: మండల కేంద్రమైన మర్రిపాడులో ఎస్సై విశ్వనాథరెడ్డి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇంటర్‌సెప్టర్‌తో పరిమితికి మించి వేగంగా వెళ్తున్న 30 వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. జాతీయ రహదారిపై పరిమిత వేగంతోనే ప్రయాణించాలని వాహన చోదకులకు సూచించారు. కారు ప్రయాణికులకు విధిగా సీటుబెల్టులు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులకు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ లలిత్ చంద్ర బృందం

ఆత్మకూరు: పట్టణంలోని 15వ వార్డు హిల్‌రోడ్డు ప్రాంతానికి చెందిన కేన్సర్ బాధితుడు షేక్ అల్లాభక్షు కుటుంబానికి తిరుపతికి చెందిన డాక్టర్ లలిత్ చంద్ర బృందం చేయూతనందించింది. కూలీ పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించే అల్లాభక్షు మంచానికే పరిమితం కావడంతో కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకుని లలిత్ బృందం సభ్యులు మహేష్, జ్యోత్స్న, కేవశ, అమర్‌నాథ్‌రెడ్డి ఆదివారం తిరుపతి నుంచి ఆత్మకూరుకు చేరుకుని రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే నెల్లూరుపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సీహెచ్ శ్రీనివాసులునాయుడు రూ.6 వేల విలువైన నిత్యావసర సరుకులు, నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. అంగన్వాడీ కార్యకర్త రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



సంగం: స్థానిక శ్రీనివాస ప్రథమచికిత్సాలయంలో ఆర్‌ఎంపీ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నెల్లూరుకు చెందిన షుగర్ డాక్టర్ సహజ 100 మందికి షుగర్, థైరాయిడ్, హార్మోన్ల పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. పీఆర్‌ఓ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆత్మకూరు: హెచ్‌ఐవీ (ఎయిడ్స్)పై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యారోగ్య సిబ్బంది అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఏసీఎస్‌ఆర్ కాలనీలో లింకు వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆరోగ్య సిబ్బంది హెచ్‌ఐవీపై ఆదివారం అవగాహన కల్పించారు. అనంతరం హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. ఎయిడ్స్‌పై అవగాహనకు ప్రభుత్వం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సహకారంతో ప్రతి నెలా ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తోందని తెలిపారు. అనంతరం ఇంటింటికి హెచ్‌ఐవీపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. డీఆర్‌పీ సురేఖ, ఎల్‌టీ కిషోర్, ఆశా కార్యకర్త అనిత, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడులు



అనుమసముద్రంపేట: స్థానిక ఎర్రపాలాల వద్ద పేకాట స్థావరం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై నరేష్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



కృష్ణారెడ్డిపాళెం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి

కలిగిరి: గ్రామాల్లో ఎవరైనా పేకాట, కోడిపందేలు వంటి జూదాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం సూర్యప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం ఆయన కృష్ణారెడ్డిపాళెం, తూర్పుదూబగుంట గ్రామస్తులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మద్యం అక్రమంగా అమ్మకాలు జరిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి న్యాయం పొందవచ్చన్నారు. వాహనచోదకులు అన్ని ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్న 94407 00098 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి చేయూత



కలిగిరి: మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నివాసం ఉంటున్న వాకా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులకు పాలూరు మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చేయూతనందించింది. ఇటీవల వాకా వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో ట్రస్ట్ చైర్మన్ పాలూరు కొండారెడ్డి రూ.5వేలు నగదు, నిత్యావసర సరుకులు, వస్త్రాలు ఆదివారం అందజేశారు. వార్డు సభ్యులు ఆవుల ప్రభాకర్‌రెడ్డి, రవి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు పరీక్షలు



ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్షకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్స్

కావలి రూరల్: గౌరవరంలోని ఆర్‌ఎస్సార్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆదివారం పరీక్షలు నిర్వహించారు. కావలి, బిట్రగుంట మండలాలకు సంబంధించి 134 మంది ఎన్‌సీసీ క్యాడెట్స్ ఏ సర్టిఫికెట్ పరీక్షకు అర్హత సాధించగా వారికి పరీక్షలు నిర్వహించినట్లు ఎన్‌సీసీ అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ రామిరెడ్డి ఆదిలక్ష్మి హాజరై ఎన్‌ఎసీసీ క్యాడెట్స్‌ను ఉత్సాహపరచి అభినందించారు. ఎన్‌సీసీ అధికారులు సునీల్‌కుమార్, సుభేదార్, రాజేష్‌కుమార్, మహవీర్, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సంగం: ర్యాంపు వద్ద నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. గాంధీజనసంఘానికి చెందిన సుబ్బారావు తన మోటార్‌సైకిల్‌కు పెట్రోల్ బంకులో పెట్రోల్ పట్టించుకుని రోడ్డు దాటుతుండగా, సంగం నుంచి నెల్లూరు వైపు మోటార్‌సైకిల్‌పై ఓ మహిళతో కలిసి వెళ్తున్న అమరేంద్ర ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో సుబ్బారావుతో పాటు అమరేంద్ర తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో బుచ్చిరెడ్డిపాళేనికి తరలించారు.

తెలుగు భాషను కాపాడుకుందాం



ఆత్మకూరు: సరళమైన తెలుగు భాషను కాపాడుకుందామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తెలుగు భారతి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే మంచిమాట కార్యక్రమాన్ని పట్టణంలోని మేధా పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. నాటకరంగ హాస్యనటుడు అన్నపురెడ్డి వెంకటరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు. నాటకరంగంలో ఎన్నో పద్యాలు గంగా ప్రవాహంలా పండిత పామర్ల నోట పలుకుతున్నాయని, అలాంటి సరళమైన తెలుగుభాషను కాపాడుకోవాలన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా మంచిమాట కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం నాటకరంగంలోని మనోహరమైన పద్యాలను రాగయుక్తంగా పాడి వినిపించారు. సమితి కార్యవర్గ సభ్యులు ఎస్‌వీ రమణయ్య, గోవింద రెడ్డి, రామిరెడ్డి, ప్రతినిధులు చలమయ్య, ఎస్ సుబ్బరాయుడు, వెలిశెట్టి నారాయణరావు, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, రామయ్యస్వామి, టీసీ వెంకట సుబ్బయ్య, కేవీ శేషారెడ్డి, అపర్ణ, శ్రీనివాసరాజు, మల్లికార్జునరావు, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

సైన్స్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

ఉదయగిరి: ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్‌పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జేవీవీ వ్యవస్థాపక సభ్యుడు డాక్టర్ జీ సుధాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక షాదీమంజిల్‌లో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ గౌస్‌బాషా, సీనియర్ నాయకుడు షేక్ దస్తగిరి అహ్మద్ అధ్యక్షతన జేవీవీ సెక్రటేరియట్‌ల జిల్లా స్థాయి సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జీ సుధాకర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జేవీవీ సభ్యత్వాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం ప్రపంచీకరణ-ప్రత్యామ్నాయ ఇంధన వనరులు, జీవపరిణామం, అంతరిక్షం, తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. జేవీవీ సీనియర్‌నాయకులు కేవీ శేషారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గాయపడిన చిన్నారికి ఆర్థిక సాయం



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

సోమశిల: ప్రమాదవశాత్తు మిద్దె మెట్లపై నుంచి జారిపడి గాయపడిన చిన్నారి వైద్యానికి అనంతసాగరం మండలం ముస్తాపురానికి చెందిన ఎంఎస్‌హెచ్ ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన చిన్నారి బషీరున్నీసా తల్లిదండ్రులతో కలిసి ఏఎస్‌పేట దర్గా సందర్శనకు వచ్చింది. ప్రమాదవశాత్తు మిద్దె మెట్లపై నుంచి జారిపడడంతో చిన్నారి తలకు బలమైన గాయమైంది. దర్గా కమిటీ సభ్యుల సహకారంతో చిన్నారిని తల్లిదండ్రులు నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి పరిస్థితిని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు వైద్యఖర్చుల నిమిత్తం రూ.3వేలు సాయం అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఉపాధ్యక్షుడు షేక్ నూర్‌బాషా, కార్యదర్శి సయ్యద్ మహ్మద్ రఫీ, అలిముత్తుజా, షేక్ మక్సూద్‌ఆలీ, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమ నిర్మాణ పనుల పరిశీలన



సంగం: మండలంలోని అమరపనాయుడుకండ్రికలో చేపడుతున్న వృద్ధాశ్రమ నిర్మాణ పనులను మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తల్లి లగడపాటి రామలక్ష్మమ్మ ఆదివారం పరిశీలించారు. ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన స్వగ్రామానికి సేవ చేయడంలో భాగంగా వృద్ధాశ్రమాన్ని అన్ని వసతులతో నిర్మిస్తున్నామని తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆశ్రమాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

న్యాక్ గుర్తింపు సాధనలో భాగస్వాములు కావాలి



ఆత్మకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి న్యాక్ అక్రిడిటేషన్ సాధించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆత్మకూరు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ జీ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ఎస్సార్‌జే కళాశాలలోని స్టడీసెంటర్‌లో న్యాక్ అక్రిడిటేషన్‌పై వర్సిటీ విద్యార్థులకు ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్సిటీ విద్యార్థులకు న్యాక్ నుంచి మెయిల్ వస్తుందని, అందులోని ప్రశ్నలకు సమాధానాలివ్వాలని కోరారు. కళాశాల సిబ్బంది రవీంద్ర, పుల్లయ్య, పెంచలయ్య, హజరత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు విశేష స్పందన



అల్లూరు: విజేతలకు బహుమతుల ప్రదానం



ఆత్మకూరు: విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్మకూరు: ఏపీ ప్రైవేట్ పాఠశాలల సంఘం (అపస్మ) ఆధ్వర్యంలో ఆత్మకూరు నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. పట్టణంలోని శ్రీమన్నారాయణ కళాశాలలో నిర్వహించిన ప్రతిభా పరీక్షకు 15 పాఠశాలలకు చెందిన 60 మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఉప్పలపాడు లిటిల్ ఏంజిల్స్ విద్యార్థి రవికుమార్ ప్రథమ స్థానంలో నిలువగా రూ.2వేల నగదు బహుమతి అందజేశారు. ఆత్మకూరు గాయిత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థి సయ్యద్ ఇలియాజ్ ద్వితీయ, సంగం వికాస్ హైస్కూల్ విద్యార్థి తృతీయ స్థానంలో నిలిచారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సీఐ నాగేశ్వరరావు, అపస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్ శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్‌వీ రమణారెడ్డి, కార్యదర్శి ఈగా భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కే కోటేశ్వరరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు వీ నారాయణరావు పాల్గొన్నారు.

అల్లూరు: అపస్మ ఆధ్వర్యంలో కావలి నియోజకవర్గ స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పరీక్ష నిర్వహించారు. నార్త్‌మోపూరులోని శ్రీచైతన్య స్కూల్‌లో నిర్వహించిన ప్రతిభా పరీక్షలకు ఏడు పాఠశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు హాజరయ్యారు. నలంద స్కూల్‌కు చెందిన షేక్ ఫర్హాన, జే ప్రత్యూష, ఎం అనీష్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. అపస్మా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నియోజకవర్గ అధ్యక్షుడు శివకుమార్, గౌరవాధ్యక్షుడు ముజహార్, శ్రీచైతన్య స్కూల్ కరస్పాండెట్ శివకుమార్, డైరెక్టర్ ఖాజారంతుల్లా పాల్గొన్నారు.

పాడిరైతుకు రూ.లక్ష ఆర్థిక సాయం



బుట్ట విజయ్‌కుమార్‌కు చెక్కు అందజేస్తున్న కాకర్ల సురేష్

కలిగిరి: తూర్పుదూబగుంటకు చెందిన పాడిరైతు బుట్ట విజయ్‌కుమార్‌కు కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ ఆదివారం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల విజయ్‌కుమార్‌కు చెందిన ఐదు గేదెలు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. కుటుంబ జీవనాధారమైన పాడి గేదెలను కోల్పోయిన పాడిరైతును ఆదుకునేందుకు ఆర్థిక సాయం అందజేసినట్లు దాత తెలిపారు. అలాగే విజయ్‌కుమార్ సమీప బంధువు బుట్ట నాగార్జునకు రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశారు.